సాక్షి
అనకాపల్లి
సోమవారం । 23 । డిసెంబర్ । 2024



పోటెత్తిన భక్తజనం

దాబాగార్డెన్స్ (విశాఖ): మార్గశిర మాసోత్సవాల 21వ రోజు ఆదివారం కనక మహాలక్ష్మి అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం 5 నుంచి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు, సహస్రనామార్చన, సర్వదర్శనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో, తులసీదళార్చనలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బొజ్జన్న కొండకు భారీగా సందర్శకులు



బొజ్జన్న కొండ వద్ద ఆటపాటల్లో విద్యార్థులు

తుమ్మపాల: అనకాపల్లి మండలం శంకరంలో గల బొజ్జన్నకొండకు ఆదివారం సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు బొజ్జన్నకొండ, లింగాల కొండలపై గల బౌద్ధస్తూపాలు, గుహలు, రాతి చిహ్నాలు, కొండ చుట్టూ ఉన్న పంటపొలాలను, ప్రకృతి సౌందర్యాన్ని తిలకించారు. ఆహ్లాదకర వాతావరణంలో రోజంతా సందడి చేశారు. కొండ దిగువన గార్డెన్‌లో చిన్నారులు ఆటపాటలతో సాయంత్రం వరకు గడిపారు. పలు సంఘాల వారు వనసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు

వరల్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాగజ్యోతి ప్రతిభ



జ్ఞాపిక అందుకుంటున్న నాగజ్యోతి

రోలుగుంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న పి.వి.ఎం. నాగజ్యోతి మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్‌ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన పోటీల్లో ఫుల్ పవర్ లిఫ్టింగ్, డెడ్ లిఫ్ట్, బెంచ్ ప్రెస్ విభాగాల్లో ఆమె ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొని విజేతగా నిలిచారు. ఈ మూడు విభాగాల్లో ఆమె బంగారు పతకాలు సాధించారు. ఆమెను పాఠశాల హెచ్ఎం ప్రసాదరావు, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

రైల్వే స్టేషన్‌లో తప్పిన ప్రమాదం

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ప్రమాదం తప్పింది. స్టేషన్‌కి వచ్చిన ఓ రైలు విద్యుత్ తీగలను ఈడ్చుకెళ్లింది. ఆది వారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. తిరునెల్వేలి-పురులియా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(22606) ఉదయం 5.20 గంటలకు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కి చేరుకుంది. రైలు ఇంజిన్‌ను మార్పు చేస్తున్న క్రమంలో తొలగించిన ఇంజిన్ ముందుకు వెళ్తూ విద్యుత్ తీగలను కొంతదూరం వరకూ ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనను గుర్తించిన రైల్వే సిబ్బంది వెంటనే చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై వాల్తేర్ డివిజన్ అధికారులు మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్‌లో 3, 4 ప్లాట్‌ఫారాలపై ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే 3వ నంబర్ ప్లాట్‌ఫాంపై తొలగించిన వైరును ఇంజిన్ ఈడ్చుకుని వెళ్లిందని స్పష్టం చేశారు.



పేలనున్న భూ బాంబ్

ఆదాయం పెంచుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం మరో బాదుడుకు సిద్ధమైంది. నూతన సంవత్సరంలో ప్రజలకు నడ్డి విరిచే నజరానా అందజేయనుంది. భూముల విలువలను అమాంతం పెంచేందుకు కసరత్తు చేస్తోంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్‌శాఖను ఆదేశించింది. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైన సమయంలో భూముల మార్కెట్ విలువ పెంచడానికి ప్రభుత్వం **నిర్ణయించడంతో సామాన్య ప్రజలతో పాటు రియల్ వ్యాపారులు ఆందో**ళన చెందుతున్నారు.సంపద **సృష్టించడం అంటే ఇదేనా అంటూ అందరూ వాపోతున్నారు.**

- **ప్రజలపై మరో బాదుడు**
- **వచ్చేనెల ఒకటి నుంచి పెరగనున్న మార్కెట్ విలువలు,రిజిస్ట్రేషన్ చార్జీలు**
- గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో 5 శాతం నుంచి 50 శాతం వరకు పెంపు
- ఇప్పటికే పడిపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారం
- జిల్లాలో 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మరింత భారం కానున్న దస్తావేజుల రిజిస్ట్రేషన్లు
- ఇప్పటికే ఎస్ఆర్‌వో కార్యాలయాల్లో ప్రదర్శించిన ధరల వివరాలు
- జిల్లా కమిటీ ఆమోదం లాంఛనమే



రియల్ ఎస్టేట్ వెంచర్

నిర్ణయించిన ధరలు రూ.ల్లో (చదరపు అడుగుకు)

నిర్మాణం	పట్టణం	పంచాయతీ
నివాసిత భవనం		
అపార్ట్‌మెంట్	1,490	900
(ఒకటి,రెండు అంతస్తులు)		
సెల్లార్,పార్కింగ్	960	640
3వ అంతస్తు నుంచి	1,520	920
వాణిజ్య భవనం		
కింది అంతస్తు	1,800	1,060
మొదటి అంతస్తు	1,700	1,010
రెండో అంతస్తు నుంచి	1,590	950
సెల్లార్,పార్కింగ్	1,060	740
షాపింగ్‌మాల్స్,మల్టీప్లెక్స్	1,590	950
థియేటర్లు,కర్మాగారాలు	950	690
మిల్లులు,పౌల్ట్రీఫారాలు	690	490

వచ్చేనెల 1 నుంచి...

ఆదాయం పెంచుకోవ**డమే పరమావ**ధిగా కూటమి ప్రభుత్వం **జిల్లాలో భూ విలు**వల పెంపునకు సిద్ధమైంది. **ఈమేరకు జిల్లా అధికారు**లు పెంపు నివేదికలు సిద్ధం చేసి, **ముసాయిదాను జిల్లా రి**జిస్ట్రార్,10 సబ్ రిజిస్ట్రార్ కార్యా**లయాల్లోని నోటీసు బోర్డుల్లో** ఉంచారు. ఈ నెల 24 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి,26న **వాటిని** పరిశీలిస్తారు.ఈ నెల 27న తుది జాబితాకు జిల్లా మార్కెట్ విలువల కమిటీ **ఆమోదం తెలుపుతుంది.ఆ త**ర్వాత జనవరి 1 నుంచి పెరిగిన భూముల **విలువలు అమల్లోకి వస్తాయి**. ఇప్పటికే భూముల విలువ తక్కువగా **ఉందనుకునే ప్రాంతాల్లో 5 న**ుంచి 15 శాతం, మిగతా ప్రాంతాల్లో 20 **నుంచి 60 శాతం వరకు** పెంచే విధంగా నివేదికలు సిద్ధం చేయడంలో రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. భూములు,నిర్మాణాల విలువలను రెసిడెన్షియల్,కమర్షియల్ కేటగిరీలుగా విభజించి ధరలు పెంచనున్నారు.

ఆందోళనలో రియల్టర్లు

ఇప్పటికే కుదేలైన రియల్ రంగానికి తాజా భూముల విలువ పెంపు ప్రతిపాదన గొడ్డలిపెట్టుగా మారింది. ముక్కుతూ మూలుగుతూఉన్న ఈరంగంలో వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయి. కొంతకాలంగా భూముల రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గాయి.జిల్లాలో స్టాంపులు రిజిస్ట్రేషన్లశాఖ నిర్ణయించిన ఆదాయ లక్ష్యాన్ని కూడా సాధించలేదు.తాజా ధరల పెంపుతో రియల్ వ్యాపారం కోలుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్న ఆందోళనను రియల్టర్లు వ్యక్తపరుస్తున్నారు.

పెంపు ప్రతిపాదనలు ఇలా..

- అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటలో గజం భూమి విలువ సుమారు రూ.1,300 ఉంది.దాని విలువ సుమారు 60 నుంచి 70 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. 60 శాతం అంటే దాదాపు రూ.2,080 అవుతుంది.ఇటీవల అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా భూసేకరణకోసం అక్కడ భూములు కోల్పోయిన వారు పరిహారాన్ని భారీగా అడిగారు.దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ గ్రామంతో పాటు రహదారికి ఇరువైపులా అన్ని చోట్ల స్థలాల విలువను బట్టి రేట్లు భారీగా పెరగనున్నాయి.
- యలమంచిలి పట్టణంలో రూ.90 లక్షలున్న ఆర్‌సీసీ శ్లాబ్ భవనం తాజా రేట్ల ప్రకారం రూ.కోటి వరకు పెరుగుతుంది.స్టాంపు డ్యూటీ 7.5 శాతం అంటే రూ.6.75 లక్షల నుంచి రూ.7.5 లక్షలకు పెరుగుతుంది.ఇందుకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ ఛార్జీలు కూడా పెరగనున్నాయి.
- యలమంచిలి పట్టణంలో గతంలో వివిధ ప్రాంతాల్లో గజం స్థలం ధర రూ.4,500 నుంచి రూ.7,000 వరకు ఉండేది.తాజా రేట్ల సవరణ ప్రకారం పట్టణంలో అన్ని చోట్ల గజం ధర ఒకేలా ఏకంగా రూ.7500 కు పెంచేస్తున్నారు.దీంతో స్థలాల రిజిస్ట్రేషన్ మరింత భారం కానుంది.



యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్కెట్ విలువల పెంపునకు సంబంధించి ఆదివారం పనిచేస్తున్న సిబ్బంది

యలమంచిలి రూరల్: భూములు,స్థలాలు,నిర్మాణాల విలువలను అమాంతం పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు పక్కనపెట్టి వరుసగా ప్రజలపై మోయలేని భారాలు పెడుతోంది. ఒకపక్క నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతుండగా విద్యుత్‌చార్జీల పెంపుతో ప్రజల నడ్డివిరిచిన కూటమి ప్రభుత్వం తాజాగా భూముల మార్కెట్ విలువ,రిజిస్ట్రేషన్ చార్జీలను భారీగా పెంచాలని రిజిస్ట్రేషన్లశాఖను ఆదేశించింది. 2025 సంవత్సరాన్ని కొత్త బాదుడుతో ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

భారీగా పెరగనున్న ఆర్‌సీసీ నిర్మాణాల ధరలు

కొత్త నిబంధనల ప్రకారం ఆర్‌సీసీ నిర్మాణాల ధరలు భారీగా పెరగనున్నాయి. కార్పొరేషన్లు,మున్సిపాలిటీల పరిధిలోని అపార్టుమెంట్లలో మొదటి రెండు అంతస్తుల్లోని ప్లాట్లకు ఒక్కో చదరపు అడుగుకు రూ.90 పెరగనుంది.ఇప్పటివరకు చదరపు అడుగు రిజిస్ట్రేషన్ విలువ రూ.1,400 ఉండగా దీన్ని రూ.1,490కి పెంచుతున్నారు. కొన్ని పట్టణాభివృద్ధిసంస్థల పరిధిలోని, నగర పంచాయతీల్లో చదరపు అడుగుకు రూ.70 పెంచనున్నారు.మూడో అంతస్తు నుంచి మాత్రం గతంలో వసూలు చేసే రేట్లనే కొనసాగించనున్నారు. వాణిజ్య భవనాలకు మాత్రం చదరపు అడుగుకు గతంతో పోల్చితే రిజిస్ట్రేషన్ విలువ రూ.100 పెరగనుంది.ఈ లెక్కన జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీలతో పాటు అచ్యుతాపురం,చోడవరం, పాయకరావుపేట,నక్కపల్లి,సబ్బవరం,లంకెలపాలెం తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారులు,ప్రధాన రహదారులకు రెండు వైపులా ఒకేలా ధరలు పెంచడానికి దస్త్రాలు సిద్ధమయ్యాయి.


అభ్యంతరాలకు అవకాశం ఏదీ ?

నిబంధనల ప్రకారం జిల్లాలోని అనకాపల్లి, యలమంచిలి, నక్కపల్లి, కోటవురట్ల,నర్సీపట్నం,చోడవరం, మాడుగుల,కె కోటపాడు, లంకెలపాలెం,సబ్బవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 20వ తేదీనే భూముల విలువ పెంపునకు సంబంధించిన వివరాలను కార్యాలయాల్లో నోటీసు బోర్డుల్లో అతికించాలి. అయితే యలమంచిలిలో ఆదివారం ఉదయం అతికించారు. మిగిలిన కార్యాలయాల్లో వివరాలను ఇంకా ప్రజలకు అందుబాటులో ఉంచలేదు.దీనినిబట్టి ప్రజలు తమ అభ్యంతరాలను చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా భూములు,స్థలాలు,కట్టడాల మార్కెట్ విలువలను పెంచడానికి కూటమి ప్రభుత్వం పూనుకుందని పలువురు ఆరోపిస్తున్నారు.



యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచిన భూముల మార్కెట్ విలువ పెంపు వివరాలు

మోయలేని భారం



భూముల మార్కెట్ విలువల పెంపు పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారమవుతుంది.గ్రామీణ ప్రాంతాల్లో కూడా భూముల ధరలను విపరీతంగా పెంచుతున్నారు. పెరిగిన భూముల ధరలతో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. రియల్ వ్యాపారం ఇప్పటికే కుదేలైంది.ఈ తరుణంలో ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడానికి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఈ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలి.

–కండిపుప్పు గోవిందరావు, యలమంచిలి

వరుసగా బాదుడే



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్య ప్రజలపై పెను భారం మోపుతోంది. ఎన్నికల ముందు గత ప్రభుత్వం ధరలు పెంచిందని బాదుడే బాదుడు అంటూ దుష్ప్రచారం చేసిన కూటమి నాయకులు, ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సంగతి మర్చిపోయారు.సామాన్యుడు స్థలం గానీ భూమి గానీ కొనే పరిస్థితి లేకుండా ధనవంతులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వం.. భూముల మార్కెట్ విలువల పెంపు విరమించుకోవాలి.

–తాటిపాకల మాణిక్యాలరావు, యలమంచిలి

ప్రజల నడ్డి విరుస్తున్నారు



పేదలకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే ప్రజల నడ్డి విరిచే నిర్ణయాలు తీసుకుంటోంది. ఇటీవల విద్యుత్ చార్జీలు పెంచారు. ఇప్పుడు భూములు,కట్టడాలతో పాటు షెడ్లు,పూరి గుడిసెలకు సైతం మార్కెట్ విలువలు,రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతున్నారు.ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగాయి. ఈ సమయంలో కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం సరికాదు. అమాంతం మార్కెట్ ధరలు పెంచడంతో ప్రజలపై మోయలేని భారం పడుతుంది. ఒక్కసారిగా భూముల ధరలు పెంచితే సామాన్యుడికి ఆస్తులు సమకూర్చుకునే అవకాశం ఎలా ఉంటుంది.కరోనా తర్వాత సామాన్య ప్రజల ఆర్థిక స్థితి ఇంకా కోలుకోలేదు.ఇది చాలా అన్యాయం,ఏకపక్షం.

– చింతకాయల శివాజీ,సీఐటీయూ నాయకుడు,యలమంచిలి

కన్నీటి సాగు..

చేతికి వచ్చిన పంట వర్షార్పణం
తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు
తేమ, రంగుమారిందన్న సాకుతో దళారుల దోపిడీ

వరుస విపత్తులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. అవసరం లేని సమయంలో అకాల వర్షాలు, సీజన్‌లో వర్షాభావం అన్నదాతలను నిండా ముంచేశాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మొదటి నుంచి ప్రకృతి వైపరీత్యాలు కర్షకులను అవస్థలు పాలు చేశాయి. మొదట్లో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఆకాశంవైపు ఆశగా ఎదురుచూస్తూ రైతులు కాలం గడిపారు. తరువాత పంట చేతికి వస్తున్న సమయంలో వచ్చిన తుపాన్లు రైతులను నిండా ముంచాయి. మరో వైపు కూటమి ప్రభుత్వం అన్నదాతల వైపు కనీసం కన్నెత్తికూడా చూడడం లేదు.

జిల్లా వ్యాప్తంగా రైతులు	ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం
2,40,000	56,410 హెక్టార్లు
ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులు	**ధాన్యం కొనుగోలు కేంద్రాలు**
1,42,000	364



తడిచిన వరి చేనును ఒడ్డుకు చేర్చుతున్న రైతు

అందని రైతు భరోసా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏటా రూ.13,500 రైతులకు అందించి ఆదుకునే వారు. అది కాకుండా పంట నష్టం జరిగితే వెంటనే నష్టపరిహారం చెల్లించేవారు. రైతుల ఇబ్బందులను కూటమి ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదని పలువురు వాపోయారు. వరుస తుపానుల కారణంగా జిల్లాలో 40 శాతం మంది రైతులు పంటలు నష్టపోయారు.

మాడుగుల: జిల్లాలో సాధారణంగా సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో తుపానుల ప్రభావం ఉంటుంది. ప్రతి ఏటా డిసెంబరు, జనవరి నెలల్లో ఖరీఫ్ వరి కోతలు, నూర్పుళ్లు జరుపుతారు. ఈ ఏడాది మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ వరి కోతలు నవంబరు నుంచి ప్రారంభమై కొనసాగుతున్నాయి. జిల్లాలో 2,40,000 మంది రైతులుండగా, ఈ ఏడాది 56,410 హెక్టార్లలో 1,42,000 మంది రైతులు వరి సాగు చేశారు. సీజన్ ప్రారంభం నుంచి వాతావరణం అనుకూలించకపోవడంతో అన్నదాతలు తీవ్ర అవస్థలపాలయ్యారు.

మొదట్లో వర్షాభావం

జులైలో కురవ వలసిన వర్షాలు కినుక వహించడంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆకు ఎండిపోయింది. మళ్లీ నారును సేకరించి వేసేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సుమారు వెయ్యి ఎకరాల్లో నారు వేయవలసి వచ్చింది. మిచాంగ్ తుపాను కారణంగా వరిచేను ముంపునకు గురైంది. ఫెంగల్ తుపాను రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఈ తుపాను కారణంగా జిల్లాలో 30 శాతం వరి పంట దెబ్బంది. తాజాగా అల్పపీడనం వల్ల కురిసిన వర్షాలతో అన్నదాత కష్టం వర్షార్పణమైంది. పొలాల్లో వరిచేను, కోతలు కోసి ఆరబెట్టిన పనలు, నూర్చి రాశులుగా వేసిన ధాన్యం తడిసి ముద్దయ్యాయి. పొలాల్లో ఉంచిన వరి కుప్పలు తడిసిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ధాన్యం రంగుమారడం, మొలకెత్తడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. దీంతో పలువురు రైతులు తక్కువ ధరకే దళారులకు ధాన్యం అమ్ముకున్నట్టు సమాచారం.

అధిక శాతం తేమ చూపించి..

రైతు సేవా కేంద్రాల్లో శాంపిల్‌ను ఒకే చేస్తున్నారు. తేమ శాతం కూడా 17 లోపు వస్తోందని చెబుతున్నారు. తీరా మిల్లర్ల దగ్గరకు వెళ్లిన తర్వాత 26 శాతం తేమ చూపించి క్వింటాళ్లకు 5 కిలోలు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. వర్షాలకు తడిసి ముద్దయిన గింజలు ఎండబెట్టి శుభ్రం చేసినా ఫలితం లేకపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూలీల కొరత ..

చేలన్నీ ఒకే సారి పంట దశకు చేరడంతో కూలీలు దొరకక అదునులో వరి కోతలు చేయలేకపోయారు. ఒక్కో కూలీకి రోజుకు రూ.500 నుంచి రూ.900 వరకు చెల్లించవలసి వచ్చింది. తుపాను హెచ్చరికలు వచ్చినా కూలీల కొరత వల్ల పంటను రక్షించుకోలేకపోయినట్టు రైతులు తెలిపారు.

రెల్లరాల్చు పురుగు... కన్నీరు మిగిల్చె

రెల్లరాల్చు పురుగు జిల్లాలో అన్నదాతకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పలు మండలాల్లో ధాన్యం గింజలు నేలపాలయ్యాయి. దేవరాపల్లి, రావికమతం, రోలుగుంట, సబ్బవరం తదితర మండలాల్లో అపారనష్టం కలిగించింది. ఆర్జీఎల్ రకం వేసిన పొలాల్లో ఈ సమస్య ఏర్పడింది. దీంతో దిగుబడి బాగా తగ్గిపోయింది. పురుగు మందుల ధరలు కూడా పెరగడంతో రైతులపై అదనపు భారం పడింది.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఆరుగాలం కష్టించి పండించిన ఎకరా వరి చేను వర్షాల కారణంగా తడిసిపోయింది. తినడానికి గింజలు కూడా వచ్చే పరిస్థితి లేదు. గతంలో రైతు భరోసా అందేది. ఈ ప్రభుత్వంలో ఒక్క పైసా ఇంకా అందలేదు. ఇప్పటికైన ప్రభుత్వం ఆదుకోవాలి.

–తమదాల కొండబాబు, రైతు, సత్యవరం,

అప్పులు మిగిలాయి



అప్పులు చేసి పెట్టుబడి పెట్టి వరి సాగుచేశాను. అల్పపీడనం కారణంగా పంట మునిగిపోయింది. దీంతో కనీసం పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

– బి.అప్పారావు, రైతు, సత్యవరం

పుణ్యకోటి వాహనంపై పురుషోత్తముడు



పుణ్యకోటి వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రముఖపుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో పుణ్యకోటి వాహనంపై స్వామివారికి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. కొండపై కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్‌కు విశేష పూజలు జరిపారు. కొండదిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికి, గోదాదేవి అమ్మవారికి, స్వామివారి ఉత్సవ మూర్తులకు నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని పుణ్యకోటి వాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధిసేవలు నిర్వహించారు. తర్వాత గోదాదేవి అమ్మవారి మూలవిరాట్ సన్నిధి వద్ద అమ్మవారి వ్రతదీక్షలో భాగంగా తిరుప్పావైలోని ఏడవ పాశురంతో ప్రత్యేక నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం తీర్థగోష్ఠి.ప్రసాద నివేదన, ప్రసాద వినియోగం జరిగాయి.ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకస్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి, రాజగోపాలాచార్యులు,దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

జీవీఎంసీకి పీఆర్‌ఎస్‌ఐ జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న రమణమూర్తి

దాబాగార్డెన్స్(విశాఖ): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్‌ఎస్‌ఐ)-2024 జాతీయ స్థాయి పురస్కారం జీవీఎంసీకి లభించింది. 'ఉత్తమ ప్రజా అవగాహన కార్యక్రమ' కేటగిరీలో ప్రథమ స్థానం దక్కిందని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి 22 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో నిర్వహించిన 46వ ఆలిండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో ఈ నెల 21న ఫార్మర్ ఎంపీ డాక్టర్ నందకుమార్ సాయి, పీఆర్‌ఎస్‌ఐ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ అజిత్‌పాఠక్, నేషనల్ జనరల్ సెక్రటరీ, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్ డాక్టర్ పీఎల్‌కే మూర్తి నుంచి ఈ అవార్డును జీవీఎంసీ తరఫున అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, పీఆర్వో ఎస్.నాగేశ్వరరావు అందుకున్నారు. 2023 నుంచి జీవీఎంసీ చేపడుతున్న ఎకో-వైజాగ్, స్వచ్ఛ సర్వేక్షణ్, సీజనల్ వ్యాధుల నియంత్రణ, వ్యర్థాలవిభజన, హోమ్ కంపోస్టింగ్, కమ్యూనిటీ గార్డెనింగ్,నీటి పొదుపు,సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిర్మూలన తదితర అంశాలపై నగరప్రజలను అవగాహన పరిచినందుకు గాను జీవీఎంసీ ఈ అవార్డు ఎంపికైందన్నారు. విశాఖ నగర ప్రజలు, నగర మేయర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్లు, నివాసిత సంక్షేమ సంఘాలు, ఫిల్మ్, స్పోర్ట్స్ సెలబ్రెటీలు, స్వచ్ఛంద సంస్థలు,ప్రభుత్వ,ప్రైవేట్ సంస్థలు, విద్యా సంస్థల సహకారంవల్లే ఈ పురస్కారం లభించిందని తెలిపారు.

క్లుప్తంగా

పంట కాలువలోకి దూసుకెళ్లిన ఆటో



మామిడివాడ సమీపంలో రోడ్డు పక్కన కాలువలో బోల్తాపడిన ఆటో

రాంబిల్లి(యలమంచిలి) : రాంబిల్లి మండలం మామిడివాడ గ్రామం సమీపంలో యలమంచిలి-గాజువాక బైపాస్‌రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం ప్రయాణికులను తీసుకువెళుతున్న ఆటో అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. రాంబిల్లి ఎస్‌ఐ నాగేంద్ర తెలిపిన వివరాల ప్రకారం రాంబిల్లి నుంచి ప్రయాణికులను యలమంచిలి తరలిస్తున్న పాసింజర్ ఆటో మామిడివాడ గ్రామం వద్ద ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణికులు స్వల్పగాయాలు పాలయ్యారు. వారిని రాంబిల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు ఇంకా అందలేదని ఎస్‌ఐ చెప్పారు.

పేకాడుతున్న 9 మందిపై కేసు

యలమంచిలి రూరల్: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోట్ల పేకాడుతున్న 9 మందిపై రెండు కేసులు నమోదు చేసినట్టు ఎస్సై కె సావిత్రి ఆదివారం రాత్రి తెలిపారు. యలమంచిలి పట్టణానికి సమీపంలో శేషుకొండ కాలనీ వద్ద పొలాల్లో పేకాడుతున్న నలుగురు నుంచి రూ.1,350, కల్కి లాడ్జి ఎదురుగా వ్యాన్ల స్టాండు వద్ద పేకాడుతున్న మరో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,850, పేక ముక్కలు స్వాధీనపర్చుకున్నట్టు తెలిపారు. రెండు కేసులను దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అలరిస్తున్న నాటిక ప్రదర్శనలు

జార్జిక్లబ్‌లో రెండోరోజు నాటిక పోటీలు



నాటిక ప్రదర్శనలో ఓ ఘట్టం

అనకాపల్లి : స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో రెండో రోజైన ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను క్లబ్ ప్రధాన కార్యదర్శి బుద్ధకాశీ విశ్వేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు నాటికలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా నాటికలను ప్రతి ఒక్కరూ చూడాలని కోరారు. ఆదివారం ప్రదర్శించిన నాటికల విశేషాలు ఇలా ఉన్నాయి..

వర్క్‌ఫ్రమ్ హోమ్ నాటిక... ఇతివృత్తం

ప్రతి మనిషిలోను ఏదో ఒక ప్రతిభ దాగి వుంటుంది. తమ మనసుకి వచ్చిన పనిలో మమేకమైనప్పుడు అది మొగ్గతొడిగి వెల్లివిరుస్తుంది. ఆ ప్రతిభే మరోసారి చిక్కుల్లోకి నెట్టి, పరీక్షిస్తుంది, ఆ చిక్కుల్ని అధిగమించి అప్రతిహతంగా దుసుకుపోయేవాడే విశ్వాన్ని సైతం ఒడిసిపట్టగలడు. అనుకున్నది సాధించగలడు. సాధారణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుధీర్ వంటల్లోను నిష్ణాతుడు, అతివల కన్నా అద్భుతంగా రుచికరమైన వంటలు చేసే ప్రావీణ్యం అతని సొంతం. గమ్మత్తేమిటంటే వంట చేయడమంటే ఆసక్తి లేని సౌమ్య అతనికి అర్ధాంగిగా రావడం. కాఫీ కలపడం కూడా నేర్చుకోని భార్యతో కొత్త కాపురం మొదలెడతాడు. దానికి తోడు తన పెళ్లి కుదిర్చిన స్నేహితుడు కిరణ్ సరదాగా చేసిన పని అతన్ని కష్టాల్లోకి నెడుతుంది. అయినప్పటికీ 'వర్క్ ఫ్రమ్ హోమ్'కు పర్మిషన్ తీసుకుని ఒకపక్క వంట, మరోపక్క ఉద్యోగంతో సతమతమవుతుంటాడు. అదేంపట్టని భార్య సౌమ్య భర్త వంట ప్రావీణ్యాన్ని బంధువులకు చేరవేస్తూ బిజీగా ఉంటుంది. వారంతా వీరి కొత్త కాపురాన్ని పరామర్శించే పేరుతో వచ్చి పోతుండడంతో వారికి మర్యాదలు చేయలేక, మరో వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించలేక ఒత్తిడికి లోనవుతాడు. చివరికి సాహసించి, జాబ్‌కి రిజైన్ చేసి 'సౌమ్య లక్ష్మీ హోమ్ ఫుడ్స్' పేరుతో కొత్త స్టార్టప్ ప్రారంభిస్తాడు. వర్క్ ఫ్రమ్ హోమ్ అద్యంతం చక్కని హస్య సన్నివేశాలతో సరదాగా సాగి స్ఫూర్తిదాయకంగా ముగుస్తుంది. మూలకథ..కె.కె.భాగ్యలక్ష్మి, నాటకీకరణ.. అద్దేపల్లి భరత్‌కుమార్, దర్శకత్వం డి.మహేంద్ర, నటీనటులు పాల్గొన్నారు.

మా ఇంట్లో మహా భారతం..

రామచంద్రరావు, అన్నపూర్ణమ్మ దంపతులకు చదువు, ఉద్యోగం లేని ముప్పై ఆరేళ్ల వాసు అనే కొడుకు ఉన్నాడు. నలభై ఎకరాలు వున్నా ఉద్యోగం లేని వాసుకి ఎవరూ పిల్లనివ్వక పెళ్లి కాదు. రామచంద్రరావు తండ్రి హరిశ్చంద్రరావు గానా బజానాలకు, రామచంద్రరావు రాజకీయాలకు అరవై ఎకరాలు ఖర్చయి, నలభై ఎకరాలు మిగులుతుంది. అది కూడా ఎక్కడ ఖర్చు అవుతుందోనని బలవంతం చేసి వాసు పేరున రాయిస్తుంది అన్నపూర్ణమ్మ. దూరపు బంధువైన బాలయ్య అనే పెళ్లి బ్రోకర్ ద్వారా నవీనా అనే అందమైన అమ్మాయి రెండు అపార్టుమెంట్స్, ఐదెకరాలు అంటు మామిడి తోట, కాలేజీలో ఉద్యోగం ఉంది.. పెళ్లి చూపులు మీ ఇంటనే జరగాలని పెళ్లి చూపులు ఏర్పాటు చేస్తాడు. పెళ్లి చూపులలో వాసుతో ఏకాంతంగా మాట్లాడి ఆస్తి వాసు పేరు ఉందని తెలుసుకుని, ఎవరికీ తెలియకుండా తన పేరున రాయించుకోని వాసుని పెళ్లి చేసుకుంటుంది. వాసులాగే నవీనాకు కూడా మందు దమ్ము కొట్టే అలవాటుంది. ఇంటి పరువు పోయి అప్పులవాళ్లు ఎగబడతారని తెలుసుకున్న రామచంద్రరావు విజయనగరంలో వున్న అపార్ట్‌మెంట్స్, అంటు మామిడి తోట అమ్ముదామంటాడు. ఆ అపార్ట్‌మెంట్స్‌లో నేను పాచిపనులు చేస్తాను.. అంటు మామిడితోటలో అంట్లు నేనే కట్టాను. కాలేజీలో ఉద్యోగం కసువులు పూడ్చే పని... అని ఆమె చెప్పడంతో మోసం జరిగింది.. బయటకు వెళ్లమంటారు. పెళ్లి బ్రోకర్ బాలయ్య రాగా, నీ కమీషన్‌కు ఆశపడి మా కులం గాని అమ్మాయిని మాకు కోడలిగా చేసి మమ్మల్ని మోసం చేస్తావా అని నిలదీస్తారు. కులందేముంది గుణం ముఖ్యం, విజయనగరంలో ఆ అమ్మాయికున్న మూడు సెంట్లు పాకయాభై లక్షలకు బేరం కుదిరి ముప్పై లక్షలు అడ్వాన్స్ ఇచ్చాడు. ఆ అమ్మాయి మా కుటుంబానికి అప్పులున్నాయి అవి తీర్చమంటే డబ్బు తీసుకుని వచ్చానని చెప్పగా ఆ అమ్మాయి మంచితనానికి అందరూ అభిమానం చూపుతుండగా నవీన వాంతి చేసుకుంటే ఆమె గర్భవతి అని తెలుసుకున్న కుటుంబ సభ్యులు పుట్టబోయే బిడ్డను డాక్టర్‌నో, ఇంజనీర్‌నో చేస్తామంటారు. కానీ నవీన దేశానికి తిండిపెట్టే అన్నదాతను చేస్తాను నా బిడ్డను అని చెబుతుంది. ఈ కార్యక్రమంలో నాటకోత్సవాల కన్వీనర్ కె.ఎం. నాయుడు, క్లబ్ అధ్యక్షుడు జోగినాయుడు, కోశాధికారి విల్లూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్ బీ సెమీఫైనల్





శ్రీ విశ్వ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



సీతమ్మధార: 'సాక్షి' స్పెల్ బీ రీజినల్ సెమీఫైనల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని శ్రీ విశ్వ స్కూల్‌లో ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ప్రధాన స్పాన్సర్‌గా 'డ్యూక్స్ వాఫీ', అసోసియేట్ స్పాన్సర్‌గా 'ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమండ్రి' వ్యవహరించాయి. వివిధ కేటగిరీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు చెందిన 150 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష బాగా రాశామని పలువురు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. 'సాక్షి' మీడియా అందించిన ప్రిపరేషన్ మెటీరియల్ తమకు ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్ కోసం ఏటా ప్రత్యేక చొరవ తీసుకుని పరీక్షలు నిర్వహిస్తున్న 'సాక్షి' మీడియాకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల మేధోశక్తిని పెంచేందుకు సాక్షి చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాన్ని 'సాక్షి'బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు పర్యవేక్షించగా.. శ్రీ విశ్వ విద్యా సంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్లు శివాజీ, సూర్యనారాయణ, డీన్ హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

SAKSHI SPELL Bee 2024-25

నమ్మకం కలిగింది



సాక్షి స్పెల్ బీ పరీక్ష కోసం కొద్ది రోజులుగా సన్నద్ధమయ్యాను. పరీక్ష బాగా రాశాను. దీంతో మరింత నమ్మకం కలిగింది. సబ్జెక్టును మెరుగుపరుచుకునేందుకు ఈ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి.

–ఎం.స్ఫూర్తి శ్రీ, పదో తరగతి, శర్వాణి విద్యాలయం, అరసవిల్లి, శ్రీకాకుళం

అర్థాలు తెలిశాయి



సాక్షి స్పెల్ బీ మాకు ఎంతో ఉపయోగపడింది. ఇంగ్లిష్‌లో లోతైన అర్థాలు తెలిశాయి. స్టేజీపై మాట్లాడేందుకు మా భాషను మెరుగుపరుచుకోవచ్చు. సాక్షికి ధన్యవాదాలు.

– ఎస్.విష్ణు శ్రీప్రియ, ఏడో తరగతి, కేకేఆర్ గౌతమి స్కూల్, ఎంవీపీకాలనీ, విశాఖపట్నం,

పరీక్ష బాగా రాశాను



సాక్షి స్పెల్ బీ సెమిఫైనల్ పరీక్ష కోసం మా అమ్మనాన్నతో కలిసి వచ్చాను. పరీక్ష చాలా బాగా రాశాను. స్పెల్ బీ పరీక్షకు సిద్ధమవడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నాను.

– వి.సాయి సహన, ఐదో తరగతి, శ్రావణి విద్యాలయం, శ్రీకాకుళం

బాల వికాస్ గురువులకు శిక్షణ తరగతులు



కాశీపురంలో బాల వికాస్ గురువులకు శిక్షణ ఇస్తున్న ప్రతినిధులు

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల బాల వికాస్ గురువులకు మానవత విలువలపై శిక్షణ తరగతులను నిర్వహించారు. సత్య సాయి సేవా సంస్థల అనకాపల్లి జిల్లా విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో గురువులు పిల్లల పట్ల అనుసరించాల్సిన విధానం, బోధన విధానం తదితర ఐదు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రార్థన, మౌనంగా కూర్చోవడం, కథలు చెప్పడం, సామూహిక గానం, ఆధ్యాత్మిక ఆటలను ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ శిక్షణ తరగతులకు రెండు మండలాల నుంచి సుమారు 30 మంది విద్యార్థులు, గురువులు పాల్గొనగా, శ్రీ సత్య సాయి సేవా సంస్థల విశాఖ జిల్లా విద్యా విభాగ సమన్వయ కర్తలు ప్రశాంతి, పద్మజ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, జిల్లా విద్యా విభాగ సయన్వయకర్త శక్తి, మండల ఇంచార్జి ఆదిరెడ్డి చినకన్నబాబు, జిల్లా భజన ఇంచార్జి స్వామినాయుడు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి



సన్యాసిరావు మృతదేహం

అనకాపల్లి : బవులవాడ గ్రామంలో స్టోన్ క్రషర్‌లో పనిచేస్తున్న లారీ డ్రైవర్ చవితిని నాగ సత్య సన్యాసిరావు(47) శనివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందినట్టు రూరల్ సీఐ అశోక్‌కుమార్ ఆదివారం చెప్పారు. సీఐ కథనం మేరకు వివరాలివి. శనివారం రాత్రి స్టోన్‌క్రషర్‌కు నాగసత్య సన్యాసిరావు లారీని తీసుకుని లోడింగ్‌కు వెళ్లాడు. అక్కడే ఉన్న మరో డ్రైవర్, క్రషర్ సిబ్బంది సన్యాసిరావు మద్యం సేవించి ఉండడంతో లారీని తీసుకుని వెళ్లొద్దని చెప్పడం జరిగింది. దీంతో రాత్రి అంతా క్రషర్ వద్ద చలిలో పడుకుని ఉండడంతో తెల్లవారేసరికి సన్యాసిరావు మృతి చెంది ఉన్నట్టు గుర్తించినట్టు సీఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, అనుమానాస్పదంగా కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ తెలిపారు.

డెకింగ్ కర్రలు విరిగి భవన నిర్మాణ కార్మికులకు గాయాలు



విరిగిపోయిన డెకింగ్ కర్రలు

తుమ్మపాల : కాపుశెట్టివానిపాలెంలో నిర్మాణంలో ఉన్న రెండంతస్తుల భవనం వద్ద ఆదివారం డెకింగ్ కర్రలు విరిగిపోయి ముగ్గురు భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారిని ఆనుకుని ఆస్పత్రి నిర్మాణం కోసం అండర్ గ్రౌండ్, రెండంతస్తుల భవన నిర్మాణ జరుగుతోంది. వేగంగా పనులు పూర్తి చేసేందుకు భవన యాజమానులు శ్రీకాకుళం నుంచి భవన నిర్మాణ కార్మికులను తీసుకొచ్చి నిత్యం పనులు చేయిస్తున్నారు. ఆదివారం సెలవు అయినప్పటికీ ఉదయం నుంచే పనులు చేపట్టేందుకు సిద్ధమైన కూలీలు రెండో అంతస్తులో బయటి వైపున గల గోడలకు ప్లాస్టింగ్ చేస్తున్న సమయంలో వారు నిల్చున్న డెకింగ్ కర్రలు విరిగిపోయి ఒక్కసారిగా కింద పడిపోయారు. దీంతో శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నౌపాడ గ్రామానికి చెందిన జీరు చిన్నారావుకు నడుంపై గాయాలయ్యాయి. ఎల్.సోమేశ్వరరావు, కృష్ణారావుకు తలపై తీవ్రగాయాలై కాళ్లు విరిగిపోయాయి. వీరిని 108 సహాయంతో స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించినప్పటికీ మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు డెకింగ్ కర్రలు నానిపోవడంతో బరువుకు విరిగిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు.

మైమరపించిన మోహిని భస్మాసుర నృత్య రూపకం



మోహినీ భస్మాసుర నృత్యరూపకం ప్రదర్శన

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ఉత్సవాల్లో 3వ రోజు మద్దిలపాలెంలో కళాభారతి ఆడిటోరియంలో మోహినీ భస్మాసుర నృత్యరూపం ప్రేక్షకులు మైమరపించింది. కళాభారతి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాంబాబు, ముఖ్య అతిథి కనక మహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, డైరెక్టర్లు నాగేశ్వరరావు, నాట్యాచార్యుడు హరి రామ్మూర్తి ప్రారంభించారు. అనంతరం మోహినీ భస్మారసుర నృత్యరూపకంలో శ్రీ మహావిష్ణువు దుష్టశక్తులను, రాక్షసులను సంహరించడానికి అనేక అవతారాలు ఎత్తిన వైనాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. నృత్య రూపకంలో గురు శ్రీ హరీ రామ్ మూర్తి భస్మాసురుడుగా, సన్నిధ మోహినిగా, సుబ్బరాజు (చెన్నై) పరమేశ్వరుడిగా అద్భుతంగా నృత్యం చేసి అందరి హృదయాలను రంజింపజేశారు. అనంతరం గురు శ్రీ హరి రామమూర్తిని ఘనంగా సత్కరించి అభినందించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాంబాబు

విధులకు వెళుతూ..విధి కాటేసి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- ఆగి ఉన్న ట్రాలీ లారీని ఢీకొట్టిన ద్విచక్రవాహనం
- రాంబిల్లి మండలం భోగాపురం వద్ద ఘటన



సంఘటనాస్థలం వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న గ్రామస్తులు, స్థానికులు



విజయ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

రాంబిల్లి (యలమంచిలి) : బాబూ విజయ్ లేవరా అంటూ ....ఆ తల్లిదండ్రులు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించేలా చేసింది. తాను పనిచేస్తున్న కంపెనీలో ఉద్యోగులను కారులో తరలించి మరలా వచ్చేస్తాను నాన్న...అంటూ తెల్లవారుజామున 4గంటలకు ఇంటి దగ్గర నుంచి బయలుదేరి అరగంటైనా గడవక ముందే కొడుకు విజయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు అన్న వార్త విని ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కొడుకుని అల్లారుముద్దుగా పెంచి ఇంటర్ వరకు చదివించి విదేశాలకు ఉపాధి నిమిత్తం పంపిస్తే తమకు ఆర్థికంగా చేదోడువాదోడుగా ఉంటాడని ఇటీవలే గాజువాకలో ఫిట్టర్‌గా ట్రెయినింగ్ ఇప్పించి అక్కడ ఉన్న ఏజెన్సీ వారి ద్వారా కొంత డబ్బును కట్టి వీసా కోసం ఎదురు చూస్తున్న తరుణంలో ఇలా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవ్వడం ఆ కుటుంబానికి తీరని దుఃఖం మిగిల్చింది. ఈ ఘటనకు సంబంధించి రాంబిల్లి మండలం సీఐ సీహెచ్ నర్సింగరావు, మృతుని బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలివి. రాంబిల్లి మండలం గోకివాడ గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి విజయ్ (20) అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కారులో ఉద్యోగులను తరలిస్తూ ఉంటాడు. విధి నిర్వహణలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు వేరే డ్రైవర్‌కు బదులుగా సర్దుబాటులో భాగంగా ఉద్యోగులను తరలించడానికి తన స్వగ్రామం అయిన గోకివాడ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై అచ్యుతాపురం కంపెనీకి వెళుతుండగా మార్గమధ్యంలో భోగాపురం గ్రామం వద్ద రాంబిల్లి నేవల్ బేస్ ప్రాజెక్టుకు నర్సీపట్నం సమీపంలో మాకవరపాలెం నుంచి బండరాళ్లను తరలిస్తున్న పెద్ద ట్రాలీ లారీ మరమ్మతులకు గురై రోడ్డు మీద నిలిచిపోయింది. వేకువ జామున మంచు ముసుగులో ఆ లారీని విజయ్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రాంబిల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విజయ్ మృతదేహన్ని పోస్టుమార్టం కోసం యలమంచిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయ్ తండ్రి అమ్మునాయుడు, బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోకివాడ గ్రామంలో విషాద చాయలు

గోకివాడ గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి విజయ్ రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలో అందరితో ఆప్యాయంగా, తోటి స్నేహితులతో ఎంతో అల్లరిగా ఉండే విజయ్ అకాలమరణం గ్రామంలో విషాదాన్ని నింపింది. ఇటీవలే ఇంటర్ వరకు చదువుకున్న విజయ్ ఆర్మీ ర్యాలీలో రెండుసార్లు పాల్గొని పరీక్షల వరకు వెళ్లినా ఉద్యోగం తృటిలో తప్పిపోయింది. చదువులో కూడా బాగా రాణించేవాడు. డ్రైవింగ్‌లో చాలా అనుభవం కలిగినవాడు. మృతుడు విజయ్‌కు తల్లి, తండ్రి, పెళ్లయిన సోదరి ఉన్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇప్పుడిప్పుడే కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా నిలుస్తున్నాడు. విదేశాలు వెళ్లి ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని పోషించాలనే తపనతో కొన్ని రోజులుగా వీసా కోసం ఆశగా ఎదురుచూస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం అతని ఆశలు చిదిమేసిందని గామస్తులు విచారం వ్యక్తం చేశారు.

ఆ చోరీకి పాల్పడింది 'తార్ గ్యాంగ్'

- అంతర రాష్ట్ర దొంగల ముఠాలోని సభ్యుడి అరెస్టు
- రూ. 5 లక్షల స్వాధీనం
- పరారీలో ప్రధాన నిందితులు



కేసు వివరాలు చెబుతున్న ఏసీపీ వెంకటరావు



స్వాధీనం చేసుకున్న నగదు

పీఎం పాలెం: భారీ చోరీని నగర పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడింది అంతర రాష్ట్ర దొంగల ముఠాగా గుర్తించారు. సుమారు 5 నెలల పాటు దర్యాప్తు చేసి నిందితుడ్ని అరెస్టు చేశారు. నేరవిభాగం ఏసీపీ ఏ. వెంటరావు ఆదివారం సాయంత్రం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొప్పర్తి వేంకటేశ్వరరావు ఆయన భార్య వేంకట సీతా మహాలక్ష్మి సంధ్యాదేవి జీవీఎంసీ 8వ వార్డులోని లా కాలేజీ రోడ్డులో ఉన్న పరోరమా హిల్స్ ఆర్కిడ్స్ 43ఏ.లో నివసిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీన పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరానికి వెళ్లి తిరిగి 9వ తేదీన ఫ్లాట్‌కు వచ్చారు. అయితే ఇంటి తాళం పగలగొట్టి ఉండడం..బీరువాలో భద్రపరిచిన 1,040 (కేజీ 40 గ్రాములు) గ్రాములు బంగారు ఆభరణాలు, రూ. 20 లక్షలు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సాంకేతికత సాయంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అంతర రాష్ట్ర తార్ గ్యాంగ్ దొంగల ముఠా చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. మధ్యప్రదేశ్‌లో వారు నివసించే ప్రాంతంపై నిఘా పెట్టారు. ఈ ముఠాకు నాయకుడుగా మధ్యప్రదేశ్ రాష్ట్రం దార్ జిల్లా తర్సింగా గ్రామానికి చెందిన కుందన్‌గా గుర్తించారు. రెండో నిందితుడిగా సురేష్, మూడో నిందితుడిగా రాకేష్‌ను గుర్తించారు. లా కాలేజీ ఏరియాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు సురేష్ ను ఆదివారం అరెస్టు చేశారు. అతని నుంచి రూ. 5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న కుందన్, రాకేష్‌ల కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం గాలిస్తోంది.

క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ఆవరణ, అయ్యప్పస్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, తిరుప్పావై కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం 400 మంది భక్తులకు ధనుర్మాస ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి దేవాలయ ప్రతినిధులు కటకం లక్ష్మణరావు, ఉప్పల శ్రీనివాసరావు, వినకోట వీర్రాజు, వెలగా కాశీపతి, సూర్య సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: స్థానిక డి–1 విద్యుత్ శాఖ పరిధిలో మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం సోమవారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల జరుగుతుందని ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూడిమడక రహదారి, శారదాకాలనీ, నెహ్రూచౌక్, వేల్పులవీధి, తహసీల్దార్ కార్యాలయం రహదారి, పాత బర్మాకాలనీ, నర్సింగరావుపేట, చవితి వీధి, దుర్గాలాడ్జి వీధి, కోట్ని వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల జరుగుతుందని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు కశింకోటకు స్పీకర్ అయ్యన్న

కశింకోట: సోమవారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కశింకోట విచ్చేయనున్నట్లు ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారన్నారు.

ఆది వారాహ అవతారంలో ధ్యాన వేంకటేశ్వరుడు

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆది వరాహ అవతారంలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చి కనువిందు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా విష్ణుమూర్తి దశావతారాల్లో మూడో అవతారంగా వరాహ అవతారంలో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. తిరుప్పావై పాశురాలను పఠించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు.



ఆది వరాహ అవతారంలో ధ్యాన వేంకటేశ్వరస్వామి

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	సత్యనారాయణ స్క్రీన్-2
ముఫాసా	పర్తిసాయి
బచ్చల మల్లి	షిర్డీసాయి
జీబ్రా	వెంకటేశ్వర
అమరన్	శ్రీసత్య
పుష్ప-2	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 22 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–7 యూనిట్లు, బీ పాజిటివ్–4 యూనిట్లు, ఓ పాజిటివ్–10 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 232 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924–223595 నంబరులో సంప్రదించవచ్చు.

వంతెన లేక ఇక్కట్లు




దోనెపై శారదా నదిలో ప్రయాణిస్తున్న రైతులు

శారదా నదిని దాటేందుకు రైతుల ఇబ్బందులు
ప్రమాదమని తెలిసినా దోనెలపై ప్రయాణం
సమస్య పరిష్కరించాలని అభ్యర్థన

కశింకోట: స్థానిక గవరపేటలో గల శారదా నదిపై వంతెన లేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల తరబడి ఇక్కడ వంతెన నిర్మించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతూ వస్తున్నారు. అయినప్పటికీ నిర్మాణం పూర్తికి నోచుకోలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి అంకురార్పణ చేసి కొంత వరకు పనులు జరిగాయి. అయితే తర్వాత పరిస్థితులు అనుకూలించక పనులు ముందుకు సాగలేదు. కూటమి పాలనలో కూడా వంతెన నిర్మాణంపై ఎవరూ పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. దీంతో నిత్యం వంతెన లేక ఇబ్బందులు ఎదుర్కొనక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో పనులకు అంకురార్పణ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2010 జనవరిలో వంతెన నిర్మాణానికి రూ.2.70 కోట్ల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేసి పనులకు అంకురార్పణ చేశారు. దీనిలో భాగంగా సుమారు రూ.40 లక్షలు ఖర్చు చేసి వంతెన ప్రతిపాదిత ప్రాంతంలో ఐరన్, సిమెంట్, కాంక్రీట్‌తో 11 స్తంభాలను భూగర్భం నుంచి నిర్మించారు. మరో ఐదు నిర్మించాల్సి ఉంది. ఇంతలో నదిలో నీరు చేరడం, కరోనా రావడం తదితర కారణాల వల్ల పనులు ముందుకు సాగలేదు. ఆ తర్వాత ఎంపీగా ఉన్నప్పుడు డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి తన నిధులు కేటాయించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని భావించారు. అయితే నిబంధల ప్రకారం పరిమితులు ఉండటంతో వంతెన నిర్మాణం పూర్తికి నిధులు కేటాయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రయత్నాలు చేశారు. తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు అవుతున్నప్పటికీ వంతెన నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులు గుర్తించి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు వంతెన నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని, తమను కష్టాల నుంచి గట్టెక్కించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.



దోనెపై ఆహ్లాదకరంగా తిరుగుతున్న సందర్శకులు

వంతెన నిర్మించాల్సిన ప్రాంతం



దోనెలే ఆధారం..

కశింకోటలోని గవరపేట ప్రాంతానికి చెందిన రైతుల పొలాలు అత్యధిక శాతం శారదా నది అవతల ఉన్నాయి. వీరు వ్యవసాయ కార్య కలాపాలు, పశువుల సంరక్షణ, పాల సేకరణకు నిత్యం నది దాటాల్సి ఉంటుంది. ఇందుకు దగ్గరి దారిగా తాటి దోనెల సహాయంతో నదిని దాటుతుంటారు. దోనె ప్రయాణం అప్పుడప్పుడు చుట్టపు చూపుగాను, సందర్శనకు వచ్చే వారికి ఆహ్లాదాన్ని కలిగిస్తుండగా, నిత్య ప్రయాణం సాగించే రైతులకు మాత్రం ప్రమాదకరంగా పరిణమిస్తోంది. నదిలో నీరు తక్కువగా ఉన్నప్పటి సంగతి ఎలా ఉన్నా నదిలో ఎక్కువ మట్టంలో నీరు చేరినప్పుడు దోనెలను నిలిపివేస్తారు. దీంతో గ్రామ శివారులో దూరంగా ఉన్న వంతెన మీదుగా సుమారు మూడు కిలోమీటర్ల దూరం నడిచి తమ పొలాలకు చేరుకోవలసిన పరిస్థితి ఈ ప్రాంత రైతులకు ఏర్పడుతుంది. అలాగే దోనెలు ఒక్కొక్కసారి మునిగి ప్రమాదాలకు గురయి పలువురు మృతి చెందిన సంఘటనలున్నాయి. 1977 వరదల అనంతరం దోనెలు మునిగి ఇద్దరు మృతి చెందారు. ఆ తర్వాత దఫదఫాలుగా నదిలో మునిగి పలువురు మృతి చెందిన ఘటనలున్నాయి. అలాగే పలుమార్లు కొందరు మునిగిపోయి అదృష్టవశాత్తు ప్రమాదం నుంచి బయట పడిన సంఘటనలున్నాయి. ఇలా దోనె ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా గత్యంతరం లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నిత్యం నదిని దాటక తప్పడం లేదు.

వంతెన లేక ఇబ్బందులు..



కశింకోటలోని గవరపేట ప్రాంతంలో శారదా నదిపై వంతెన నిర్మాణం పూర్తి చేయాలి. ఇక్కడ వంతెన లేక నిత్యం తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. దోనెలు ఒక్కొక్కసారి ప్రమాదానికి గురవుతున్నాయి. దీంతో బిక్కుబిక్కుమంటూ గత్యంతరం లేక దగ్గరి మార్గంగా దోనెలపై రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీని దృష్ట్యా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలి.

– సూరిశెట్టి ఆదిబాబు, రైతు, కశింకోట.

వ్యవసాయ కార్యకలాపాలకు ఆటంకం..



శారదా నదిపై వంతెన లేక వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఏ మాత్రం నది ప్రవాహం పెరిగినా దోనెలు నిలిపివేస్తుండటంతో గ్రామ శివారులో ఉన్న వంతెన మీదుగా సుమారు మూడు కిలోమీటర్ల మేర దూరం దాటి చేరుకోవలసి వస్తోంది. ఇది తీవ్ర ఇబ్బందికరంగా పరిణమిస్తోంది. ఇప్పటికైనా అధికారులు వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– వేగి సత్యనారాయణ, రైతు, కశింకోట.

నిధుల మంజూరుకు ప్రతిపాదించాం..

గవరపేటలో శారదా నదిపై వంతెన నిర్మాణానికి రూ.3.50 కోట్ల నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించాం. నిధులు మంజూరు కావలసి ఉంది. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం.

– వేణుగోపాలరావు, డీఈ, పంచాయతీరాజ్ శాఖ, అనకాపల్లి.

సన్యాసమ్మకు ఘన నివాళి

కశింకోట: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ నాయనమ్మ సన్యాసమ్మ (95) ఆదివారం తన ఇంటి వద్ద మృతి చెందారు. ఆమెకు విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావుతో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. గ్రామ సర్పంచ్‌గా 1995లో బాధ్యతలు నిర్వహించారు. సన్యాసమ్మ మృతికి పలువురు సంతాపం తెలిపారు. పార్టీ మండధ్యక్షుడు మలసాల కిషోర్, మండల సచివాలయ సమన్వయకర్త కలగా గున్నయ్యనాయుడు, అనకాపల్లి పార్టీ యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

పూర్వ విద్యార్థుల సందడి



కలుసుకున్న ఆదినారాయణ మహిళా కళాశాల పూర్వ విద్యార్థినులు



సందడి చేస్తున్న గవరపాలెం చిన్నహైస్కూల్ పూర్వ విద్యార్థులు

అనకాపల్లి: గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్ 1979–80 టెన్త్ పూర్వ విద్యార్థులు 44 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. గవరపాలెం మరిడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం వీరంతా కలుసుకుని ఆనందంగా గడిపారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో గడిపారు. మధ్యాహ్నం వన భోజనం చేశారు. 60 సంవత్సరాలు పైబడి, ప్రభుత్వ శాఖలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఎస్.వెంకటేశ్వరరావు, శివరామ్ మూర్తి, ఆడారి రామారావు కాండ్రేగుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో..

తుమ్మపాల: ఆదినారాయణ మహిళా కళాశాలలో 1988–93లో ఇంటర్, బీఏ చదివిన ఆర్ట్స్ గ్రూప్ పూర్వ విద్యార్థినులు ఆదివారం కలుసుకున్నారు. 32 సంవత్సరాల తర్వాత పట్టణంలో గవరపాలెం శ్రీ గౌరీ సేవా సంఘం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, శ్రీకాకుళం వంటి దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా వచ్చి తీపి జ్ఞాపకాలు పంచుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు, కుటుంబ నేపథ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి అధ్యాపకులు ఇందిర, రత్నమాల, కనకదుర్గ, పద్మకుమారి, కమల, వెంకటలక్ష్మి, విజయను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు చూపిన అభిమానం పట్ల అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు సతీమణి మాధవీలత, కాండ్రేగుల శ్రీలక్ష్మి, కొణతాల జ్యోతి, కర్రి పద్మావతి, బుద్ద భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొండల బ్లాస్టింగ్‌తో ఆలయాలు శిథిలం

అనకాపల్లి: మండలంలో బవులవాడ గ్రామంలో కొండల బ్లాస్టింగ్ కారణంగా గ్రామంలో దేవాలయాలు శిథిలావస్థకు చేరుకుటుంన్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే చర్యలు తీసుకుని కొండల బ్లాస్టింగ్‌ను ఆపి గ్రామంలో నివసిస్తున్న ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానికులు అప్పలరాజు, కొండబాబు, సూరి అప్పారావు, మల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్‌కు, ఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు



చొడువాడలో వేకువజాము సమయాల్లో మేలుకొలుపు కార్యక్రమం



సత్యవరం గ్రామ రామాలయంలో భజనల్లో పాల్గొన్న మహిళలు

కె.కోటపాడు : చొడువాడ గ్రామంలో వేకువజాము సమయాల్లో భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం పురస్కరించుకుని గ్రామంలో సతకంపట్టు రామాలయం వద్ద నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ నెల 16 నుంచి నెలగంట కార్యక్రమాన్ని ప్రారంభించిన రోజు నుంచి భోగి పండగ వరకూ ప్రతి రోజూ ఉదయం 4 గంటల నుంచి రామాలయం నుంచి రాముని చిత్రపటంతో మేల్కొలుపు కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహిస్తున్నారు. భక్తి భావంతో జరిగే ఈ మేల్కొలుపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు.

మాడుగుల : మండలంలో సత్యవరం గ్రామంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మేలుకొలుపు ఉత్సవాలు నిర్వహించారు. గ్రామ పుర వీధుల్లో దీపారాధన నిర్వహించి అనంతరం రామాలయంలో ప్రత్యేక భజనలు నిర్వహించారు. నెల గంట ప్రారంభం నుంచి భోగి రోజు వరకు మేలుకొలుపులుతో పాటు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం అనాది కాలంగా వస్తుందని, నిర్వాహకులు బి.పాల్గుణ, జి.మాలతి, ఎం.సత్యవతి, జి.చిన్నమ్మలు చెబుతున్నారు.

కోలాటం మహిళలకు చీరల పంపిణీ

కె.కోటపాడు : మల్లంపాలెం గ్రామానికి చెందిన కోలాటం నిర్వహించే మహిళలకు గ్రామానికి చెందిన ఇద్దరు దాతలు చీరలు, కోలాటం సామగ్రి వారి సొంత నగదుతో సమకూర్చారు. 20 మంది మహిళలకు చీరలను రూ.15వేలతో రొంగలి కిరణ్ అందించారు. అదే విధంగా రూ.5వేలతో వార్డుమెంబర్ వంటాకు గోవిందరావు కోలాటం సామగ్రిని వీరికి గ్రామస్తుల సమక్షంలో అందించారు.

కరాటే పోటీలు ప్రారంభం

అనకాపల్లి: ప్రతి మహిళ కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి హాల్లో ఆదివారం రాష్ట్రస్థాయి నిజి షో ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్–2024 పోటీలు చీఫ్ కోచ్ ఎస్పీఎండీ నాయుడు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ స్వీయ రక్షణే మహిళలకు శ్రీరామరక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నక్కపల్లి మండలం పాటిమీద గ్రామానికి చెందిన పెంటకోట నాని 11 మద్యం క్వార్టర్ బాటిళ్లు కలిగి ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ ఐ.ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు నానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రిస్మస్ సందర్భంగా ఉచితంగా సరకులు ఇవ్వాలి

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం క్రిస్మస్ పండగ సందర్భంగా క్రైస్తవులకు రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరకులు ఉచితంగా పంపిణీ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో టీడీపీ పాలనలో క్రిస్మస్ పండగను పురస్కరించుకుని ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వంలో కూడా క్రిస్మస్ కానుకలు ఇవ్వాలని కోరారు.

గౌరీపరమేశ్వరులకు సారె సమర్పణ



సారె తీసుకెళ్తున్న వేల్పుల వీధి మహిళలు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కుంచావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ కమిటీ మహిళా సభ్యులు సారె అందజేశారు. వేల్పులవీధి ఆలయం నుంచి ఊరేగింపుగా ఆలయం వరకూ పెద్ద సంఖ్యలో మహిళలు సారె తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు



కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి

మాడుగుల రూరల్ : ధనుర్మాసోత్సవాలు ఆలయాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు వైష్ణవాలయం, రామాలయాల్లో ఉదయం, సాయంత్రం పూజలు, మేలుకొలుపు నిర్వహిస్తున్నారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి పూజలు, భక్తులు గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో ప్రతి శనివారం రాత్రి భజన కార్యక్రమం, చద్ది ఏర్పాటు చేస్తున్నారు. కె.జె.పురం రామాలయంలో ప్రతి రోజు రాత్రి భజన కార్యక్రమం, తెల్లవారుజామున భక్తుల ఆధ్వర్యంలో పురవీధుల్లో మేలుకొలుపు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మండలంలో వి.వి.అగ్రహారం, పెంటయ్యపాలెం, పోతనపూడి, జి.అగ్రహారం, వీరనారాయణం, ఎం. కోటపాడు, చింతలూరు, గాదిరాయి, వంటర్లపాలెం, ముకుందపురం రామాలయాల్లో ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు.

యాదవ సంఘం ఆత్మీయ సమావేశం



సంఘం జిల్లా అధ్యక్షుడు బాబూరావును సత్కరిస్తున్న నాయకులు

అనకాపల్లి: యాదవ కులస్తులందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బర్నికాన బాబూరావు అన్నారు. మండలంలో బొజ్జన్న కొండ వద్ద సంఘం మండల అధ్యక్షుడు పంచదార్ల కన్నారావు ఆధ్వర్యంలో యాదవ సంఘం రాజకీయ నాయకుల ఆత్మీయ సమావేశం, వన భోజన కార్యక్రమం ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యాదవ సంఘం భవన నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఎవరైనా ఇబ్బంది పడుతుంటే సంఘంలో ఆర్థికంగా బలపడిన వ్యక్తులు ఆదుకోవాలని కోరారు. అనంతరం సంఘం సభ్యులు జిల్లా అధ్యక్షుడు బాబూరావుని మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కనకసోమునాయుడు, నియోజకవర్గ అధ్యక్షుడు పంచదార్ల సూరిబాబు, సంఘం నాయకులు వియ్యపు నూకరాజు, ఒమ్మి రాముయాదవ్, వాయిబోయిన ఈశ్వరరావు, బందం రమణ, పల్లా తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి



వెదురుపర్తిలో విద్యార్థులు నిర్వహిస్తున్న జాతీయ గణిత దినోత్సవ ర్యాలీ



విద్యార్థుల మానవహారం



నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో జాతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి ఆదివారం పండగలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత శాస్త్రానికి శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలను వివరిస్తూ, మన శాస్త్రవేత్తలే నిజమైన హీరోలనే భావన కలిగిస్తూ విద్యార్థులు గ్రామ వీధుల్లో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. గణిత భావనలకు సంబంధించిన పాటలు, నాటికలు విద్యార్థులు ప్రదర్శించి స్థానికులను ఆకట్టుకున్నారు. దీంతో ఇక్కడ నెల రోజుల పాటు నిర్వహించిన జాతీయ గణిత మాసోత్సవాలు ముగిశాయి.

'అమిత్‌షా రాజీనామా చేయాలి'

తుమ్మపాల: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా రాజీనామా చేయాలంటూ సీపీఐ నాయకులు ఆదివారం మెయిన్‌రోడ్డుపై గల బుద్ధుని విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లోనే అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే అతన్ని హోంమంత్రి పదవి నుంచి తొలగించాలన్నారు. రాజ్యాంగ నిర్మాతపై గౌరవం లేని అమిత్‌షా పార్లమెంట్ సభ్యుడిగా అనర్హుడన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.బాబ్జి, ఎం.యిర్మాయా, కోరిబిల్లి శంకరరావు, వీరు యాదవ్, సత్యనారాయణ, సింహాద్రి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మోదమాంబ ఆలయానికి విరాళం

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు మోదమాంబ ఆలయానికి స్థానికులు రేణం శేషగిరి లక్ష్మి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో రూ.15వేలు విరాళం ఆదివారం అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు ఈ నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన అర్చకులు శ్రీనివాస శాస్త్రి, నాయకులు పడాల అప్పలనాయుడు, సతీష్, హరిప్రసాదు, చిట్టిబాబు, మూర్తి, జగదీష్, అప్పలనర్సయ్య, అప్పలనాయుడు, జగదీశ్ పాల్గొన్నారు.